

# రైలు ప్రయాణం

ప్లాట్‌ఫారమ్. నంబర్ ఒన్ మీద కదలడానికి రెడీగా నిలబడి ఉంది జనతా ఎక్స్‌ప్రెస్.

"జాగ్రత్తగా వెళ్ళమ్మా. అంత దూరం ఒక్కర్తివి ఎలా వెడతావో మరి? వెళ్ళగానే ఉత్తరం వ్రాయి."

నేను ఒక్కదాన్నే ప్రయాణం చేయడం ఇదే మొదలు. అందుకే నాన్న నాకు బోధన చేస్తున్నారు.

ఎటో చూస్తున్న నేను అటు వంక చూస్తూ నాన్న చెప్పేవాటికి "ఊఁ" కొడుతున్నా. నా తరవాత వాడు రాజు, చెల్లెలు పద్మ నా చుట్టూ తిరుగుతూ అల్లరి చేస్తున్నారు.

"బిస్కెట్ ప్యాకెట్ కొనుక్కో" మని రాజుకి హ్యాండ్‌బ్యాగ్ లోంచి అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాను, నాన్న చూడకుండా.

ఒకు పున్నరకు వెళ్ళాను. దానికి కారణం ఏమిటో తెలుసు. నే నింకా చిన్నదానిని రోజులు ఎంచలేదని దాని బాధ.

నేను పుట్టాక నాన్న వాళ్ళ ఊరు వెళ్ళి, దాన్ని తీసుకొచ్చారు.

"నాకూ ఉండాలనే ఉంది, అక్కా! కాని, శ్రీవారి సంగతి తెలుసుగా?" అన్నాను నెమ్మదిగా.

"నాకు ఇంక ఇక్కడ తోచదు, బాబూ, నేనూ వెళ్ళిపోతాను" అంది అక్క.

"అదేం? అమ్మా, నాన్నా బాధ పడతారు మనిద్దరం ఒక సారి వెళ్ళిపోతే" అన్నాను.

అక్క మౌనంగా ఊరుకుంది.

అది, నేను శ్రీవార్లు ఇచ్చిన డబ్బులే గాక, నాన్న ఇచ్చినవి కూడా పెట్టి చక్కగా సినిమాలు, షికార్లు చేసుకుని ఉన్న డబ్బుల్ని దులిపేసుకుంటాం! ఆ రోజులు నిమిషాల్లా హాయిగా గడిచి పోతాయి.

"అవునుగాని, మీ ఆయన ఈ సారి ఎందుకు రాలేదు? సెలవు దొరకలేదా?" అంది.

ప్రశ్న అదే వేసి సమాధానం కూడా అదే చెప్పేసింది!

"అప్పు మావా ఏడిపిస్తాడు, నెల్లాం సెలవల తిరుగు లేవి? నాన్న కంటే అల్లుడుగారి. అడిగి వచ్చి వెళ్ళడానికి ఆఫీసర్‌కి అల్లుడా ఏమన్నావా?" అన్నాను.

"నువ్వూ, నీ మాటలూ మారలే దమ్మీ!" అంది ఆశ్చర్యంగా.

"నెలరోజు లున్న తరవాత ఇప్పుడా కూపెట్టడం?" అన్నాను.

అక్క నా మాటలకి నవ్వేసింది.

ఎనౌన్సర్ ఎప్పుడు చెప్పిందో కాని మా కబుర్లలో పడి మేము వినలేదు.

ఇంజన్ పెద్దగా కూసింది.

రాజు, పద్మ చెవులు మూసుకున్నారు.

"త్వరగా ఎక్కమ్మా!" అన్నారు నాన్న.

బండితో పాటు నాన్న నడుస్తూ, "రాజని పంపుతానంటే విన్నావుకాదు" అంటూ నాన్న ఇంకా అదే ధోరణిలో ఉన్నారు.

"శక్తి లేకున్నా ఇక్కడుకున్నావా, నాన్నా? నీకు ఇప్పటికే బోలెడు ఖర్చయింది, చాలు. నువ్వేం బెంగ పెట్టుకోకు. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాను" అన్నాను.

"అవునమ్మా, నువ్వే అర్థం చేసుకున్నావు" అన్నారు.

రాజు, పద్మ 'టా! టా!' చెబుతున్నారు కనుమరుగయ్యేంత వరకు. అక్కయ్య మాత్రం చూస్తూ నిలుచుండిపోయింది.

స్పీడు అందుకుంది బండి.

• • •

నే నెక్కింది ఇంజను తరవాత రెండో కంపార్ట్‌మెంటు. జనం క్రిక్కిరిసి ఉన్నారు.

వెనకాల 'పెట్టెలన్నీ ఖాళీగా వస్తున్నాయా?' అనుకున్నాను ఆ జనాన్ని చూసి.

సినిమా హాళ్ళ దగ్గర, బస్సుల్లోను, రోడ్ల మీద— ఎక్కడ చూసినా ఇలాగే ఉంది. ఇంకా ఇక్కడ తక్కువేనే అని సరిపెట్టుకున్నాను.

ఇంతసేపూ ఆలోచిస్తూ నిలుచున్నా నని గుర్తొచ్చి అమ్మ అక్కడికి

ఎ. సుభ

స్పెషల్ గా మూట కట్టిన మినప సున్నిలు, గోంగూర పచ్చడి మొదలైనవి ఉన్న సామాన్లు పైన పర్చేసి సీటుకి చివరగా కూర్చున్నామెను కొద్దిగా జరగమన్నాను.

ససేమిరా వీల్లేదంది. నాకు కోపం వచ్చింది. దెబ్బలాడ్డానికి నా ప్రెస్టేజీకి భంగం మరి.

నా అవస్థ చూసి ఎదురుగా ఉన్నామె జరిగి కాస్త చోటిచ్చింది. 'హమ్మయ్యా' అనుకుని కూర్చున్నాక ఈమె వంక కృతజ్ఞతగాను, ఆమె వంక గర్వంగాను చూశాను.

అప్పుడే సీటు సంపాదించేశానని కొందరు నా వైపు ఈర్ష్యగా చూశారు.

* * *

కంపార్ట్మెంటులో ఏదో 'చిల్లర' సంభాషణ జరుగుతూంది ప్రతి ఇద్దరి మధ్యా.

కూరగాయల దగ్గర్నుంచి రాజకీయాల వరకు సాగుతూంది. రాజకీయాలు ఎంత చౌకైపోయాయి అనుకున్నాను.

"చాలామటుకు ప్రజలకి అన్యాయం జరుగుతోంది. ఏవి చూసినా విపరీతమైన ధరలే!' అన్నాడొక ముసలాయన కళ్ల జోడు సరిచేసుకుంటూ.

"నిజమే. మధ్యలో వర్తకులు బాగు పడుతున్నారు" అన్నాడు ఎదురు సీట్లోని తోటి ప్రయాణికుడు.

"దేనికీ కొరతలేదు? బియ్యానికి, పంచదారకి. పంచదార రేషను. పైగా రేషన్లో ఇవ్వరు. బ్లాక్‌లో కొనుక్కోవడానికి బోలెడుంది, దీనికిలాగ నూలుకి కూడాను. సరేసరి, కరెంటు." పక్కనున్న అతను వీరి సంభాషణలో పాల్గొన్నాడు.

ప్రజల కోర్కెలు, వాటి గురించి అల్లరులు అలా ఉండగా పట్టించుకోని ప్రభుత్వంలా పరుగులు తీస్తూంది బండి.

దేశంలో ఇంతమంది ఉద్యోగులున్నారు. నాకేనా ఉద్యోగం లేకపోత? ఇదేమౌతుందో అనుకున్నాడు—డిగ్రీ చేత బుచ్చుకుని ఇంటర్వ్యూకి వెడుతున్న నిరుద్యోగి.

బయట ఎండ పలచగా ఉంది. జనం ఇంత మంది ఉన్నా గాలి మటుకు బాగానే వీస్తూంది, బండి నడుస్తూంది కనక.

కొద్ది దూరంలో నల్ల కళ్లజోడు ఒకటి పెట్టుకుని ఓ పత్రిక లోని సినిమా బొమ్మలు అదేపనిగా చూడసాగాడు, రంగులు పూసుకున్న తారల ఒంపు సొంపుల్ని.

ఇక్కడ కూడా ఆ జోడు ఎందుకూ? అనుకున్నాను. కాని, అంతలోనే ఏదో సినిమాలోని 'మెల్ల కంటికి నల్లటి జోడు' పాట జ్ఞాపకం వచ్చింది.

పక్కనే మరి కొద్ది దూరంలో సీటు మీద కూర్చున్న కాషాయరంగు గుడ్డల సన్యాసి నిలబడ్డ సంసారితో సంసారంలో ఉన్న ఈతిబాధల గురించి పెద్దగా లెక్చర్ దంచుతున్నాడు.

వింటున్న అతన్ని చూసి జాలేసింది, సంసారుల బాధల గురించి ఈ సన్యాసి చెబుతా డేమిటి? సంసారం లేనిదే వీ కెలా తెలుసు అందులోని లోటుపాటుల గురించి? అనాలనిపించింది.

కొంచెంసేపు విన్నాక ఆ సంసారికే విసుగెత్తి ఉంటుంది, సన్యాసి ఉపన్యాసం. ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

వ్యాపారంలో చేసే మోసాలు, కిటుకులు సీటు సంపాదించడంలో కూడా పనికొస్తా యనుకున్నాడేమో, లాభం లేక పెట్టెమీద కూర్చుని పెద్ద బొజ్జ సరిచేసుకుంటూ కూర్చున్నా డో నామాలశెట్టి.

వీళ్లకి కూడా పెద్ద బొజ్జలుంటాయి అనుకున్నాను. తేరగా వచ్చింది తినకేం చేస్తారు? మినిస్టర్లకీ అంతేగా?

మా బండి వేగం అందుకుంది.

దాదాపు పావు గంట గడిచాక ఏదో చిన్న స్టేషను వచ్చింది. బండి ఆగలేదు, ఎక్స్‌ప్రెస్ గనక.

రాబోయే పాసింజరు బండికోసం నిలబడ్డ ప్రయాణీకులు మా బండి వేపు గుర్రుగా చూస్తూ నిలబడ్డారు, "ఇది ఎక్కే అదృష్టం మనకు లేదే?" అన్నట్టుగా.

కరెక్టు ఉద్యోగిలా ఆకు పచ్చ జెండా పుచ్చుకుని నిలబడ్డాడు, స్టేషను మాస్టరు.

ఇంకా అందరూ దేశంలో గల సమస్యల గురించే మాట్లాడుకుంటూ, అందులో మునిగి ఉన్నారు.

వీళ్ల సమస్యలూ, కోర్కెలూ మొదలైనవి ఇలా ఉండగా, ఆంధ్ర సమస్యలు పట్టించుకోని ప్రధానమంత్రిలా హాయిగా కిటికీ నానుకుని నిద్రపోయాను.

* * *

బద్ధకంగా కళ్లు తెరిచి టైము చూసుకున్నాను. పన్నెండయిందా అనుకునే టప్పటికి బాగా ఆకలేసింది.

భోజనం కానిచ్చి, ఆ వారం వీక్లీ ఒకటి కొన్నాను.

పేజీలు తిప్పేటప్పటికి ఎలక్షన్ల గురించే ప్రతిచోటా. ఇప్పుడు ఎలక్షన్ల రోజులని జ్ఞాపకమొచ్చింది.

మంత్రుల మీద కావలసినన్ని కార్టూన్లున్నాయి.

వాళ్లకి బుద్ధా ఏమన్నానా? ఎంత మంది వ్యాసాలు వ్రాస్తేనేం? ఎన్ని కార్టూన్లేస్తేనేం? దులిపేసుకుంటారు తమని కాదన్నట్టుగా!

లేదా మా గురించి గనక గొప్పగా వ్రాసుకుంటున్నారు ప్రజలు, వేసుకుంటున్నారు పత్రికలవాళ్లు అనుకుంటారు గామోసు!

పుస్తకం మూసి బాగ్‌లో పెట్టేశాను.

ఏ స్టేషనులో ఎక్కారో ఏమో ఇద్దరు కొత్తవాళ్లు కనుపించారు. బహుశా భార్యాభర్తలై ఉంటారు.



నింగినంటు...

ఫొటో—ఉమ (తెనాలి)

నా వైపు చూసి ఆమె పలకరింపుగా నవ్వి, "ఏ ఊరు వెడుతున్నారు?" అంది.

చెప్పాను. కొద్దిసేపటికి ఇద్దరం కబుర్లలో పడ్డాం.

మాటల సందర్భంలో చెప్పింది, తనకు పిల్లలు లేనట్లు, అందుకోసమై పక్క ఊరి డాక్టర్ దగ్గర పరీక్ష చేయించు కొస్తున్నట్లు.

సంతానం వద్దు, మీరు కనకండర్రోయ్ అంటున్న ప్రభుత్వం అరుపులు జ్ఞప్తికొచ్చాయి.

పిల్లలకోసం పాట్లు పడేవారు కొందరు. ఏమిటో? ప్చ్! అనిపించింది.

సంచీలో ఉన్న టానిక్ సీసాలూ అవీ చూపింది.

"ఫరవాలేదులెండి. మీ కృషి ఫలిస్తుంది! ఈ టానిక్‌లన్నీ కడుపులో పాపాయిగా మారుతా" యని అభయమిచ్చాను.

ఆమె మొదట సిగ్గుపడి, తరవాత నావైపు కృతజ్ఞతగా చూసింది.

తరవాతి స్టేషనులో వారు దిగిపోయారు. ఆ స్టేషనులోనే రద్దీ ఎక్కువయింది.

లోపలున్న వాళ్ళు పై వాళ్ళని, పైనున్న వాళ్ల లోపలున్న వారిని తిట్టుకుంటున్నారు.

లోపలున్న వాళ్లు ముల్కీల్లాగాను, పైనున్న వాళ్లు ఆంధ్ర వాళ్ళగాను అనిపించిం దా క్షణంలో.

పది నిమిషాలకి గొడవ తగ్గింది.

లోపల మహా ఉక్కగా ఉంది. ఎక్కడో పైన ఉన్న ఫాన్లు రెండూ సమ్మె చేస్తున్న కార్మికుల్లాగ ఉన్నాయి, తిరగడం మానేసి.

అమ్మేవాళ్ల కేకలతోటి, కొనేవాళ్ల బేరాలతోటి గోలగా ఉంది.


ఈ ప్రయాణం ఎప్పుడైపోతుందా? అనుకున్నాను విసుగ్గా.

ఈ సందడిలో ఎవరిదో పర్స్ కొట్టేశారట! అతను ఇంటికి వెళ్లాక ఏం చెప్పాలి అంటున్నాడు.

ప్రత్యేకాంధ్ర గురించి ప్రధాన మంత్రి దగ్గరి కెళ్లొచ్చిన మినిస్టరు ముఖంలా ఉం దతనిది.

అతణ్ణి ఓదార్చ వలసిందల్లా పోయి, ఎవరి పర్సులు వారు తడుముకుంటున్నారు జేబుల్లో చేతులు పెట్టి, ఉన్నాయో, లేదో అన్నట్టుగా.

కాఫీ త్రాగి అందర్నీ పలకరిస్తూ కూర్చున్నాను.




శుభ్రత గురించి అందుకున్నాడో ఎట్టతల పెద్దమనిషి, వేరుశనక్కాయల తొక్కుపోస్తూ, గింజలు నోట్లో వేసుకుంటూ!

కాల్చిన బీడీ క్రోవలో క్రింద పారేసి, దాని తాలూకు పొగ వదులుతూ— "ఈ థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్లో ఇంతేనండి" అని సాయపడ్డాడు మరొకాయన.

"ఎవరిమటుకు వారు అలా అంటూ, శుభ్రంగా ఉన్న కాస్త జాగా పాడు చేస్తున్నారు" అందా మనిపించింది. నా ఉద్దేశం కనిపెట్టినట్లుగా వాళ్ళ సంభాషణ వేరే దారి తీయడంతో ఊరుకున్నాను.

టైము ఏడయింది సరిగా.

ఎవరో ట్రాన్సిస్టర్ తెచ్చారుగామోసు- 'వార్తలు — బాంగ్లాదేశ్' అంటూ మొదలయ్యాయి, దేవుణ్ణే తలుచుకుంటున్నట్లు.

దీనికంటూ ఏమీ లేదు! కావి, ఉన్న కాస్త దానికి ఊదిపెట్టడం, భరించడానికి పాపిష్టి ప్రజ ఉన్నారుగా అధిక సన్నుల పేరిట? ఇదింకో చోటికి వెళ్లి చెయ్యి చాపటం.

ఇలా కడుగుతూ ఉంటారు మన స్వచ్ఛమైన భారత దేశాన్ని ఎట్టుకుని.

నా చిన్నప్పుడు మా బామ్మ అనేది, తనకున్నదానిలో ఎదుటివారికి పెట్టమని.

అందుకే మన దేశం అంటే ఇష్టం నాకు.

"ఇన్ని జరుగుతూన్నా మన ఇండియా అంటే నీ కెందు కంత అపేక్ష, సుజా?" అన్నారు మా శ్రీవా రొకసారి.

"దేశమంటే అభిమానం లేని భారతీయుడు! మనది మన కిష్టంలేనప్పుడు పై వాళ్ళకి లోకువ కదా" అన్నాను.

అప్పట్నుంచి ఆయన నా పార్టీయే.

ఏదో ఊరిలో విద్యుచ్ఛక్తి, మరో ఊరిలో నీటి కొరత వగైరాలు చెప్పే శాక వార్తలు సమాప్తమయ్యాయి.

అన్నిటికీ కొరతే, వినే చెవులకీ, చూసే కళ్లకీ తప్ప!

అవతలివైపు ఒకామె పూర్వకాలం మనిషేమో మరి? ఫాషన్ల గురించి, వాటి ఆకారాలు వికారాలుగా మారడం, మారుతున్న ప్రపంచం గూర్చి, పెరిగిపోయిన తెలివితేటల గురించి పక్కనున్న ఆమెతో చెబుతూంది. నిజమే ననిపించింది నాకు!

మన నాగరికత రాను రాను ఎలా అభివృద్ధి చెందుతూంది? అని ఆశ్చర్యంగా ప్రశ్నించుకున్నాను.

అంతవరకు బాగానే ఉంది. ఆమె చెప్పినది తరవాత—"ఆడ పిల్లలుమాత్రం ఫాషన్‌గా ఉండకూడదుట, ఎలాగైనా అవి మగవాళ్లకే చెల్లుట."

నాకు చిరాకేసింది. ఈమె కూడా కేవలం ఒక స్త్రీ అయి ఉండి ఇంత దుయ్యబట్టడం బాగులే దనిపించి, ఎంతైనా సజాతి కనక ఆమెతో కాస్సేపు వాదించాను, "పిల్లకి తప్పైనప్పుడు, వాళ్ళకీ అంతే మరి! ఈ రూల్ ఒక్కరికే కాదు" అని. కాస్సేపాగి, ఆమె ఏమీ మాట్లాడక పోవడం చూసి, "మగవారిలా ఆడవారు, ఆడవారిలా మగవారు తయారౌతున్నప్పుడు, సమానంగా ఉన్నారు కదా! ఒకరి నొకరు ఏమీ అనుకో నక్కర్లేదు" అన్నాను.

ఆమెకి నే నడ్డంగా వాదించడం ఇష్టం లేనట్లు ముఖం పెట్టింది. అందుచేత ఊరుకున్నాను. లేకపోతే ఇంకా ఏం వాగుదునో మరి!

మా శ్రీవారి మాటలు జ్ఞాపక మొచ్చాయి. ఒకసారి రాజకీయాల గురించి, నిరుద్యోగ సమస్యలు వగైరాల గురించి కాలక్షేప మౌతుందికదా అని మొదలెట్టాను.

"సుజా, నా కంత ఓపిక లేదు వినడానికి. నీ బుర్రలో రక్తం ప్రవహించడం లేదు సుమా చాలా కాలంగా, ఇది తప్పు" అన్నారు.

"ఏ...దుర్మార్గులు మీరు. మీ బుద్ధికి తగ్గట్టుగా ఏ మినిస్టర్ పదవో ఉంటే బాగుండేది."

"హాయిగా కారులో తిరుగుదును. టాక్సీ, రిక్షా ఖర్చులు తప్పును" అన్నారు నవ్వుతూ.

ఊహాలోకంలో శ్రీవారితో విహరిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

• •

మెలుకువ వచ్చేటప్పటికి నడిరాత్రి అయి ఉంటుంది.

బండి వేగం తగ్గింది. ఏదో చిన్న స్టేషను సమీపించి మెల్లగా ఆగింది. రెండు నిమిషాలే ఆగింది. బయటకు చూశాను. ఇంత పొడవైన బండిలోంచి ఒక్క మనిషిమాత్రమే దిగాడు.

మమకారం లేని తల్లి బిడ్డని వదిలేసినట్లు రైలు వేగం అందుకుంది.

నిద్ర పట్టలేదు. ఎక్స్‌ప్రెస్ అయి ఉండి పాసింజరులా కుంటి నడక నడుస్తూంది. బండి దిగి నడిచి వెళ్లిపోదామా అనుకున్నాను అడ్డుతో వేదైనా చూసుకుని. కాని, శ్రీవారు స్టేషను కొచ్చి చిరాకు పడతారేమో అనుకుని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. అబ్బ, ఇంకా ఎంత దూరం? అనుకున్నాను.

దూరమంటే నా స్నేహితురాలు విమల జ్ఞాపక మొచ్చింది. దానికి పుట్టిల్లు, అత్తవారి ఇల్లు ఒక చోటేనూ. దాని కది నచ్చదు. నా కిది నచ్చదు.

"నువ్వే నయమే, సుజాతా, మీవా రెక్కడో పనిచేస్తున్నారు. నువ్వు వచ్చినప్పుడు మా వాళ్ళు నిన్ను ఆప్యాయంగా చూస్తారు" అంటుంది, తన భర్తకు ఉన్న ఊర్లోనే ఉద్యోగమని వాపోతూ.

మా బంధువుల్లో కూడా నన్ను చాలా ఇదిగా చూస్తారు, "ఎక్కడో దూరాన ఉన్నావు" అంటూ.

పాపం, నిజం వాళ్ళ కేం తెలుసు మరి? మా శ్రీవారికి ఉన్న ఊళ్లో ఉద్యోగం దొరక్క ఇంతదూరం వెళ్లవలసి వచ్చింది. ఇది గొప్పగా భావిస్తారు వాళ్ళు. ఉన్న ఊళ్లో ఉద్యోగం లేక ఎక్కడికో పోయారు వీళ్లు అనుకోరు.

మా గొప్పకి కారణం ఇది. బాగుం దనుకున్నాను, కాని, ఎన్నైనా వాగుతాను కావి, ఈ నిజం బయట పెట్టలేదు.

• • •

స్టేషన్‌లో దిగి శ్రీవారికోసం ఆత్రంగా చూశాను. కనుపించక పోయేసరికి కోపం వచ్చింది.

కూలీ ఒకడు సామాను పుచ్చుకున్నాడు. చేసేది లేక వెనక నడిచాను వాడి భాష నాకు రాదు గనక.

సామాను ఇవతలికి తీసుకొచ్చి డబ్బు లడిగితే ఇచ్చాను. వాడు కోపంగా అరుస్తున్నాడు. ఇంతలో శ్రీవారు వచ్చి, "సారీ, సుజా. కాఫీ తాగి వచ్చేటప్పటికి ఆలస్యమైంది" అన్నారు.

"మీ కాఫీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు" అన్నాను కాస్త కోపంగానే.

ఆ కూలివాడు ఏదో చెప్పాడు. ఈయన కూడా ఏమిటో చెప్పి పర్స్ తీసి ఏమిచ్చారో మరి, వాడు గర్వంగా నా

చిత్రం — గిరికట్టి (మద్రాసు)

వైపు చూసి, లంచం ముట్టిన ఆఫీసర్‌లా ముఖం పెట్టుకుని వెళ్ళిపోయాడు. ఆ కాసేపు ఇంగ్లీషు సినిమా చూస్తున్న తెలుగు ప్రేక్షకుడిలా విసుగ్గా నించున్నాను.

"దానకర్ణులే! పదండి" అన్నాను నా వైపు చూస్తున్న శ్రీవారితో.

"ఎంతమందికి ఎక్కువ డబ్బిచ్చాటం లేదు! అకాలమే గాని ఫకాలం కాదుగా" అన్నారు.

ఇవతలి కొచ్చేసరికి డొక్కుది ఒక టాక్సీయే ఉంది. నాకు విసు గెక్కువైంది. అది మేకప్‌లేని సినిమా తార అప్పుమైన ముఖంలా ఉంది.

నా అదృష్టం బాగుండి వేరే టాక్సీ వచ్చింది.

నేను వచ్చేశానన్న సంతోషంతో శ్రీవారు అన్ని కబుర్లు చేప్పేస్తున్నారు. నాకు కోపమొస్తుందని ఇల్లంతా చక్కగా సర్దేశారట. "సిగరెట్టు పీకలన్నీ ఏరి అవతల పారేశా"నని అంటూంటే మధ్యలో అడ్డొచ్చి, "నెల రోజుల్లో ఎన్ని వందలు కాల్చా రేమిటి?" అన్నాను.

"వారానికి రెండు పెట్టెలు మాత్రమే! నీ మీద". అనబోయి "నా మీద ఒట్టు" అన్నారు.

నాకు నవ్వొచ్చింది.

"సొంత పెళ్ళానివి కదా అని కాస్సేపు ఒట్టుకూడా పెట్టుకోనివ్వవు కదా!" అంటూ తానూ నవ్వేశారు.

"నాకు చచ్చే ఆకలిగా ఉంది!" అన్నాను.

"ఇంకెంత? పది నిమిషాలు ఓపిక పట్టు. అన్నీ రెడీ చేసేశాను. చావకు మరి. ఆ మొగుడు ముండా కొడుకు పెళ్ళానికి తిండిపెట్టకుండా చంపాడంటారు. పైగా నన్ను ఆడిపోసుకుంటారు" అన్నారు.

వస్తున్న నవ్వు పెదాల మధ్య బిగపెట్టి కూర్చుని, ఇల్లు రాగానే దిగాను.

లోపలి కెళ్ళబోయి హేండ్‌బాగ్‌లో నాన్నకి వ్రాసి ఉంచుకున్న కవరు తీసి పక్కనే ఉన్న పోస్టు బాక్సులో పడేశాను.

శ్రీవారు ఆశ్చర్యంగా అడగబోయేంతలో "మా నాన్న బెంగ మీకు తెలుసుగా? మిమ్మల్ని వ్రాయమంటే వ్రాయరు! పెళ్ళానికంటే గంటకొకటి చొప్పున ప్రేమ లేఖలు వ్రాయగలరు!" అన్నాను.

"పేచీలోనే మొదలెట్టావు యుద్ధం. ఈ నెల రోజులు గడవలేదంటే నమ్ము" అన్నారు.

నవ్వుకుంటూ శ్రీవారి వెనకాల ఇంట్లోకి నడిచాను. ★

